క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



మర్రిపాడు: మండల తహసీల్దార్‌గా కే స్వప్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై మర్రిపాడు తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు



అల్లూరు: ఇస్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వివిధ రకాల సాంస్కృతిక పోటీలను మంగళవారం నిర్వహించారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశభక్తి పాటలు, నృత్య, అభినయ పోటీలను నిర్వహించినట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. విజేతలకు స్వాతంత్ర దినోత్సవం నాడు బహుమతులను ప్రదానం చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాల మంజూరుపై విచారణ



ఉదయగిరి: పట్టణంలోని మోచి (ఎస్సీ–బీ) కులస్థులకు ధ్రువీకరణ పత్రాల మంజూరుపై ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ జహీర్‌బాబు మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మోచి కులానికి సంబంధించి 15 కుటుంబాలు ఉన్నాయన్నారు. వారికి 2016 వరకు కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేశారని, ఆ తరువాత నిలిపివేశారని చెప్పారు. అందుకు గల కారణాలపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. వీఆర్వోలు జాఫర్, వెంకటేశ్వర్లు, మస్తాన్ పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



చేజర్ల: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీఈఓ గోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని తూర్పుపల్లి, ఆదూరుపల్లి ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తూర్పుపల్లి ఉన్నత పాఠశాలలో ఓ గదిలో శ్లాబు పెచ్చులూడి ఉండడం గమనించి అందులో విద్యార్థులను కూర్చోబెట్టవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలపై శిక్షణ



సీతారామపురం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంఈఓ మస్తాన్‌వలి పాల్గొని మాట్లాడారు. ఈ నెల 8న అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకుని వారి ద్వారా చైర్మన్, వైస్‌చైర్మన్లను ఎన్నిక చేసి ప్రమాణ స్వీకారం చేయించాలని సూచించారు.

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ–2 శ్రీనివాసులు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డితో కలిసి ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఎస్ఎంసీ ఎన్నికల నియమావళి అనుసరించి చైర్మన్, వై స్‌చైర్మన్లను ఎన్నిక జరిగేలా చూడాలని సూచించారు. ఏదైనా సమస్యలుంటే వెంటనే సమాచారం అందించాలన్నారు.

దశాబ్దాల కల సాకారం

బొగ్గేరుపై వంతెన నిర్మాణం
- మూడు మండలాలను కలిపే రోడ్డు పనులకు మోక్షం
- రూ.9 కోట్లతో పనులు ప్రారంభం
- మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చొరవతో 30 గ్రామాలకు రవాణా సౌకర్యం



రామస్వామిపల్లి సమీపంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాలను కలిపే రహదారి నిర్మాణం మూడు మండలాల ప్రజలకు దశాబ్దాల కాలంగా కలగానే మిగిలిపోయింది. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యదీక్షతతో ఆ కల సాకరమైంది. బొగ్గేరుపై వంతెన నిర్మాణంతో పాటు మూడు మండలాల్లోని 30 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించే రహదారి నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ.9 కోట్లతో చేపడుతున్న ఈ పనులు ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మండలం వెన్నవాడ–గండ్లవేడు మధ్యన అర కిలోమీటరు దూరం బొగ్గేరు ఉంది.దానిపై వంతెన లేదు. దీంతో ఇరువైలా ఉన్న గ్రామాల ప్రజలు కొన్ని దశాబ్దాలుగా రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బొగ్గేరులో నీరు లేని సమయంలో ఇసుకలో అతికష్టం మీద రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో దాదాపు 12 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి. ఈ సమస్యపై మూడు దశాబ్దాలుగా బాధిత గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు అనేక సందర్భాల్లో విజ్ఞప్తులు చేసినా బుట్టదాఖలాలు అయ్యాయి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కార్యాచరణకు చొరవచూపారు. ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి బంట్లపల్లి మీదుగా మర్రిపాడు మండలం డీసీపల్లి, ఆత్మకూరు మండలం వెన్నవాడ, గండ్లవేడు, వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు రహదారి, బొగ్గేరుపై వంతెన నిర్మాణ పనులకు రూ.9కోట్లు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించి గండ్లవేడు వద్ద శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. ఎన్నికల కారణంగా పనులు ప్రారంభించడం ఆలస్యమైంది. ప్రస్తుతం రామస్వామిపల్లిలోని 0 పాయింట్ వద్ద పనులు ప్రారంభించి కొనసాగిస్తున్నారు.ప్రస్తుతం రామస్వామిపల్లి–బంట్లపల్లి మధ్యలో పనులు చివరి దశకు చేరుకున్నాయి. మరో మూడు నెలల్లో మర్రిపాడు మండలం డీసీపల్లి, ఆత్మకూరు మండలం వెన్నవాడ, గండ్లవేడు, వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు పనులు పూర్తి చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్ చురుగ్గా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ఇబ్బందులు పడిన గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వెన్నవాడ-గండ్లవేడు మధ్యన బొగ్గేరుపై వంతెన నిర్మాణం చేపట్టనున్న ప్రదేశం

రైతులకు ఎంతో ఉపయోగం



రామస్వామిపల్లి నుంచి డీసీపల్లి మీదుగా నల్లగొండ్ల వరకు చేపడుతున్న రోడ్డు నిర్మాణంతో మూడు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం కలుగుతుంది. 67వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న ఈ రోడ్డు పొగాకు, ఇతర వాణిజ్య పంటలు సాగుచేసే రైతులకు ఎంతో ప్రయోజనం. దశాబ్దాలుగా తమ ఉత్పత్తులను తరలించేందుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపుతూ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం సంతోషకరం.

–కొప్పోలు యల్లారెడ్డి, రామస్వామిపల్లి

30 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం



బొగ్గేరుకు ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు విద్యా, వైద్య, ఆరోగ్య, వ్యాపార అవసరాల నిమిత్తం ఆత్మకూరు, నెల్లూరు, బద్వేలుకు వెళ్లేందుకు డీసీపల్లి వద్ద ఉన్న 67వ నంబరు జాతీయ రహదారికి చేరుకోవాలంటే అదనంగా 12 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. గండ్లవేడు–వెన్నవాడ మధ్యన ఉన్న బొగ్గేరుపై వంతెన, రోడ్డు నిర్మాణాలు పూర్తయితే మూడు మండలాల్లోని 30 గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయి.

– మద్దినేని నరసింహ, గండ్లవేడు, ఆత్మకూరు

దశాబ్దాల సమస్యకు పరిష్కారం



మా తాతల కాలం నుంచి బొగ్గేరుకు ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజల సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం బొగ్గేరుపై వంతెన, రోడ్డు నిర్మాణాలతో మా తరంతో పాటు భావితరాలకు సైతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అండగా నిలుస్తుంది. ఇన్నేళ్లకు రోడ్డు సౌకర్యం కలగడం మాటల్లో చెప్పలేని సంతోషాన్ని కలిగిస్తుంది.

–రేవూరు నరేంద్ర రెడ్డి, వెన్నవాడ, ఆత్మకూరు మండలం

మెనూ ప్రకారం భోజనం అందించాలి

సీతారామపురం: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ మస్తాన్‌వలి సూచించారు. మంగళవారం ఆయన చిన్నాగంపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలతో పాటు హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు పీసీఎం కొండయ్య, మురళి ఉన్నారు.

గడ్డివామి దగ్ధం

సంగం: మండలంలోని కోలగట్లలో చినపెంచలయ్యకు చెందిన పదెకరాల్లోని గడ్డివామి మంగళవారం అగ్నికి ఆహుతైంది. గేదెల మేత కోసం వేసుకున్న గడ్డివామి కాలిపోవడంతో సుమారు రూ.60వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఈ క్రాప్ నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

సీతారామపురం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటకు ఈ క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సూచించారు. స్థానిక బిట్–1 రైతు సేవా కేంద్రంలో వీఏఏలకు ఈ క్రాప్ నమోదుపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ప్రస్తుతం 2.4 వర్షన్‌తో ఈ పంట యాప్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ సెప్టెంబరుతో ముగియనుందన్నారు. ఆలోగా ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందజేసేఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం అందుతాయన్నారు. రైతుల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని రాస్తారోకో



ఆత్మకూరులో మహిళలతో కలిసి రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



సోమశిల: రాస్తారోకో నిర్వహిస్తున్న మంచాలపల్లి ఎస్సీకాలనీవాసులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఏసీఎస్ఆర్‌కాలనీ, అనంతరాయనియేని, టిడ్కోకో అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి సెంటర్‌లో సీపీఎం నాయకులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ రెండు వారాలకుపైగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి రామనారాయణరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, షేక్ సందాని, పద్మమ్మ, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం మంచాలపల్లి ఎస్సీ కాలనీవాసులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీబిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ కాలనీలో వారం రోజులుగా తాగునీరు సరఫరావకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు కమతం వెంకటేశ్వర్లు, కాకి రవి, భూమన శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



ఆత్మకూరురూరల్: ఆత్మకూరుకు చెందిన శ్రీవెంకటేశ్వర ప్రజావైద్యశాల ఎండీ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్‌చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకుని మురగళ్ల పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తోడేటి అశోక్, ఉపాధ్యాయిని శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్త మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మేట్‌ను కొనసాగించాలని వినతి

సోమశిల: సోమశిలకు చెందిన ఉపాధి హామీ పథకం మేట్ బైనబోయిన భాస్కర్‌ను కొనసాగించాలని కూలీలు కోరారు. మంగళవారం వారు సర్పంచ్ చలంశెట్టి పెంచలయ్య, మాజీ సర్పంచ్ ఉప్పల విజయ్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. భాస్కర్ స్థానంలో మరో వ్యక్తిని మేట్‌గా నియమిస్తున్నట్లు తమకు తెలిసిందన్నారు. భాస్కర్ వచ్చిన తరువాతే తమకు ఉపాధి వేతనాలు బాగా అందుతున్నాయన్నారు. ఈ విషయాన్ని మండలాధికారుల దృష్టికి తీసుకెళ్లి మేట్‌ను కొనసాగించాలని కోరారు.

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతారామపురం: మండలంలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఈఓ మస్తాన్‌వలికి యూటీఎఫ్ మండల శాఖ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఓగూరువాండ్లపల్లి ఉన్నత పాఠశాలలో 3,4,5 తరగతులు బోధించేందుకు ఎస్జీటీని డిప్యుటేషన్‌పై నియమించాలని కోరారు. తురకపాళెం ఎయిడెడ్ పాఠశాల రికార్డులను సమీపంలోని ఉర్దూ ఎంపీపీఎస్ పాఠశాలకు అప్పగించాలని, బసినేనిపల్లి ఉన్నత పాఠశాలలో కలిపిన ఏసీనగర్ ఎంపీపీఎస్ పాఠశాలకు సంబంధించిన 3,4,5 తరగతుల విద్యార్థులను తిరిగి ఆ పాఠశాలకే పంపుటకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ నాయకులు బోగ్యం శ్రీనివాసులు, గొడ్లవీటి వెంకటేశ్వర్లు, రంతుజాని, నరసింహరాజు, ఎడమ తిరుపతయ్య, పీసీఎం కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం లక్ష్యాలను సాధించాలి



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌ఎన్ సుశీలమ్మ

వరికుంటపాడు: వైద్యారోగ్య సిబ్బంది నూరు శాతం లక్ష్యాలను సాధించాలని వైద్యాధికారిని కరిష్మా సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు. అడల్ట్ బీసీజీ టీకాపై వయోజనులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పీహెచ్‌ఎన్ సుశీలమ్మ రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.

వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుపై శిక్షణ



ఏఎస్‌పేట: వరిపైరును పరిశీలిస్తున్న ఏడీఏ దేవసేనమ్మ



మర్రిపాడు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన, వ్యవసాయశాఖల అధికారులు

మర్రిపాడు: మండలంలోని పొంగూరులో ఉద్యాన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో పంటల సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ రాజశేఖర్ రెడ్డి నిమ్మలో పూత యాజమాన్యంపై అవగాహన కల్పించారు. జూలైలో జిబ్బరిలిక్ యాసిడ్ 50పీపీఎం ఒక గ్రామును 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సెప్టెంబరులో సైకోసిల్ 1 మి.లీ.ను లీటరు నీటికి, అక్టోబర్‌లో పోటాషియం నైట్రేట్ 10 గ్రాములును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. డ్రిప్, స్ప్రింకర్లను సబ్సిడీపై అందజేస్తున్నామని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏఓ రామ్మోహన్ కౌలురైతు కార్డు, పొగాకు నారుమడి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం వేరుశనగ, బొప్పాయి, నిమ్మ పంటలను క్షేత్ర పరిశీలన చేసి సస్యరక్షణ చర్యలను సూచించారు.

అనుమసముద్రంపేట: మండలంలోని పందిపాడులో సాగు చేసిన వరిపైరును ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ పరిశీలించారు. పొలంలో లవణాలు ఎక్కువగా ఉన్నందున పైరు పెరుగుదల సరిగా లేదని తెలిపారు. బోర్లలోని నీటిని నేరు మడిలోకి వదలకుండా కాలువల ద్వారా పెడితే లవణాల ప్రభావాన్ని తగ్గించవచ్చని, తద్వారా వరిపైరు ఎదుగుదలను పెంపొందించవచ్చునని తెలిపారు. ఆమె వెంట ఏఓ టీ రజని, ఏఈఓ చిరంజీవి, వీఏఏలు బీ ప్రసాద్, శ్రీహరి, రైతులు ఉన్నారు.

విద్యార్థుల జాబితాను సిద్ధం చేయండి

ఉదయగిరి: ఈ నెల 20న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలోని 6 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థుల జాబితాను సిద్ధం చేయాలని వైద్యాధికారిణి శివకల్పన సూచించారు. గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య సిబ్బందితో మంగళవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తరువాత ఆల్బెండాజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారిణి శివకల్పన

తల్లిపాలలో రోగ నిరోధక శక్తి పుష్కలం



కావలి: ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు



ఏఎస్‌పేట: అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ



మర్రిపాడు: డీసీపల్లి సెక్టార్ పరిధిలో..



ఆత్మకూరురూరల్: చెర్లోయడవల్లిలో..



వరికుంటపాడులో..

కావలి: తల్లి ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని, బిడ్డ పుట్టిన వెంటనే పడితే అనారోగ్య సమస్యలు దరిచేరవని కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్, కావలి ఐఎంఏ నాయకుడు డాక్టర్ కామంచి సుబ్బారావు తెలిపారు. కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, బాలితలకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరునెలలు వచ్చే వరకు తల్లిపాలు పడితే ఆరోగ్యవంతంగా ఎదుగుతారని తెలిపారు. మహిళా వైద్యుల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ఉషాసతీష్, కార్యదర్శులు డాక్టర్ రష్మి, డాక్టర్ రమ్య, పింక్ మిషన్ విభాగం అధ్యక్షులు ఉషాపార్థసారథి, కార్యదర్శి డాక్టర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని పడమటిరొంపిదొడ్ల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్తమ్మ తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం విశ్రాంతమ్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని నార్త్‌కొండాయపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, పాఠశాల హెచ్ఎం వెంకటసుబ్బయ్య తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అనూష, నాగూరమ్మ,భాగ్యమ్మ, రత్నమ్మ, చంద్రకళ, ప్రసూన్నాంబ, సుబ్బమ్మ, సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : మండలంలోని మన్నెంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు లక్ష్మీదేవి, సరిత, సుజాత, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు:పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. డాక్టర్ అస్మా తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ సుధాకర్, ఏఎన్ఎం పద్మ, అంగన్‌వాడీలు సుప్రజ, షకీల, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీలు పద్మ, విజయకుమారి, సునీత, షాహినాబాను తల్లిపాల విశిష్టతపై గర్భిణులు,బాలింతలకు అవగాహన కల్పించారు.

ఆత్మకూరురూరల్: చెర్లోయడవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అనూషా పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత, సూపర్‌వైజర్ నారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు నిరోషా, విజయమ్మ, శాంతి, వసంత, పరమేశ్వరి పాల్గొన్నారు.

మర్రిపాడు: డీసీపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఎం పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరై తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బోయళ్ల పద్మజ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. తల్లి ముర్రుపాల విశిష్టతను వివరించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సీడీపీఓ సునీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.